క్లుప్తంగా

టెట్ ఫీజు తగ్గించాలి

నెన్నెల: రాష్ట్రంలో లక్షలాది మంది అభ్యర్థులు రాసే టెట్ పరీక్ష ఫీజును వెంటనే తగ్గించాలని బీఎడ్ జిల్లా సంఘం నాయకుడు రాంటెంకి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం నెన్నెలలో విలేకరులతో మాట్లాడారు. టెట్ పరీక్ష ఫీజును పెంచి పేద, మధ్యతరగతి వర్గాలపై ఆర్థిక భారం మోపడం సరికాదన్నారు. పోటీ పరీక్షల ఫీజు పెంచమని మెనిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు నిరుద్యోగ యువత దగ్గర ఫీజులు వసూలు చేయడం అంటే మోసం చేసినట్లేనని విమర్శించారు. 2023 సెప్టెంబర్‌లో నిర్వహించిన పరీక్ష ఫీజుకు ఒక పేపర్‌కు రూ.200 మించలేదని ఇప్పుడు ఒక పేపర్‌కు రూ.వెయ్యికి పెంచడం బాధాకరమన్నారు. పెంచిన టెట్ పరీక్ష ఫీజులు తగ్గించాలని, లేకుంటే రానున్న ఎంపీ ఎన్నికల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

భవిత సేవలు సద్వినియోగం చేసుకోవాలి



పరిశీలిస్తున్న ఎంఈవో ప్రభాకర్

తాండూర్: దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ సూచించారు. బుధవారం మండల విద్యా వనరుల కేంద్రంలోని భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా 18 ఏళ్లలోపు దివ్యాంగులకు ఐఈఆర్‌టీ వెంకటేశ్వర్లు ఫిజియోథెరపీ పరీక్షలు చేపట్టారు. నాడీ వ్యవస్థ లోపం, ఆర్థోపెడిక్ సమస్యలు ఉన్న పిల్లలను భవిత కేంద్రంకు తీసుకువచ్చి ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోవాలని ఎంఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాసాడి శ్రీరాములు, సతీష్ పాల్గొన్నారు.

బోరుబావి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న స్థానికులు

భీమారం: మండలంలోని కొత్తపల్లిలో కోయవాడలో దాహార్తి తీర్చేందుకు గంగారం సోలార్ పవర్ ప్లాంట్ యాజమాన్యం మంజూరు చేసిన బోరుబావి నిర్మాణ పనులను బుధవారం గ్రామపెద్దలు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలోని కోయవాడలో ఏర్పడిన నీటి ఎద్దడి నివారణ కోసం బోరుబావి వేసేందకు ముందుకు వచ్చినట్లు తెలిపారు.

వృద్ధాశ్రమానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న రాజిరెడ్డి


చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని గెర్రె కాలనీలో సాయి అన్నపూర్ణ వృద్ధాశ్రమ నిర్మాణానికి మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయి అన్నపూర్ణ వృద్ధాశ్రమ నిర్వాహకులు అద్దె ఇంటిలో ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వృద్ధులకు తన వంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో ఆశ్రమ నిర్మాణానికి సొంత స్థలాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి బాపు, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, కౌన్సిలర్ పోగుల సతీశ్, ఆశ్రమ నిర్వాహకులు సత్తెయ్య, నడిపల్లి లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

బెల్లంపల్లి డీఎల్‌పీవోగా సఫ్దర్‌అలీ



అలీకి నియామక పత్రం ఇస్తున్న డీపీవో

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి(డీఎల్‌పీవో)గా సఫ్దర్ అలీ నియామకం అయ్యారు. ఈ మేరకు బుధవారం మంచిర్యాల డీపీవో వెంకటేశ్వర్‌రావు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఐడీవోసీలోని డీపీవో కార్యాలయంలోని డీఎల్‌పీవో చాంబర్‌లో సఫ్దర్‌అలీని పంచాయతీరాజ్ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డీపీవో వెంకటేశ్వర్‌రావుతో పాటు మంచిర్యాల డీఎల్‌పీవో ధర్మారాణి, ఎంపీవోలు శ్రీపతి బాపు, శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. కాగా బెల్లంపల్లి డీఎల్‌పీఓగా పని చేసిన బి.భిక్షపతి పునర్విభజనలో భాగంగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో సఫ్దర్‌అలీకి డీఎల్‌పీవోగా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు.



విద్యుత్ కాంతుల్లో రామాలయం

నగర సంకీర్తనలో రేండ్లగూడ గ్రామస్తులు



సీతారాముల విగ్రహ ప్రతిష్టకు ఏర్పాట్లు

జన్నారం: మండలంలోని రేండ్లగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామాలయంలో లక్ష్మణ, హనుమాన్ సమేత సీతారాముల ఉత్సవ మూర్తుల విగ్రహాల ప్రతిష్టకు ఆలయం ముస్తాబైంది. రేండ్లగూడ గ్రామ పెద్దలు, ప్రజలు బుధవారం ఉదయం ఆలయానికి చేరుకుని గ్రామంలో నగర సంకీర్తన చేశారు. అనంతరం దేవతారాధన చేశారు. అనంతరం అభిషేకం, యంత్ర పూజ జపములు గావించారు. సుదర్శన లక్ష్మీనారాయణ హోమం నిర్వహించారు. నగర సంకీర్తనలో చిన్నారులు రామలక్ష్మణ వేషాధారణతో ఆకట్టుకున్నారు. గురువారం విగ్రహాల ప్రతిష్ట నిర్వహించనున్నట్లు ప్రధాన ఆచార్యులు గొల్లపెల్లి రామానందాచార్య స్వామి, శ్రీధర చార్యులు తెలి పారు. ఈ ఉత్సవంలో గ్రామ పెద్దలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

రామలక్ష్మణ వేషాధారణలో చిన్నారులు









దాహార్తి తీర్చిన లీకేజీ

నెన్నెల: ఎండలు భగ్గుమంటున్నాయి... గ్రామాల్లోని చెరువులు, కుంటలు, వాగులు, వంకలు, బావుల్లో నీరు లేక నెర్రలు తీశాయి. మండల కేంద్రంలోని కొంత మంది రైతులు పశువులను మేపకోలేక రోడ్లపై వదిలేస్తున్నారు. అవి రోడ్ల మీద దుకాణాల ముందు తిరుగుతూ ఆకలి తీర్చుకుంటున్నాయి. తాగడానికి నీరు లేకపోవడంతో గ్రామ పంచాయతీ బోర్‌వెల్ వద్ద, నీటి ట్యాంకర్ వద్ద , నల్లాల వద్ద లీకేజీ అవుతుండటంతో ఆ నీటిని తాగి దాహార్తిని తీర్చుకుంటున్నాయి.

దొనబండలో అభివృద్ధి పనుల పరిశీలన



పల్లెదవాఖానాలో వివరాలు ఆరా తీస్తున్న ఎంపీడీవో

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ గ్రామ పంచాయతీలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను బుధవారం ఎంపీడీఓ మధుసూధన్ ఆకస్మిక తనిఖీలు చేపట్టి పలు సూచనలు చేశారు. ముందుగా పంచాయతీలోని రికార్డులను పరిశీలించి గ్రామంలోని పల్లె దవాఖానాను సందర్శించి అందిస్తున్న వైద్య సేవలను ఆరా తీశారు. అనంతరం గ్రామ నర్సరీని పర్యవేక్షించి మొక్కల సంరక్షణకు చేపడుతున్న చర్యలను తెలుసుకుని వేసవిలో మొక్కల రక్షణకు ఏర్పాటు చేసిన గ్రీన్‌షేడ్ నెట్‌ను పరిశీలించి అన్ని గ్రామాల్లోని నర్సరీలకు గ్రీన్‌షేడ్ నెట్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు. వర్మీ కాంపోస్ట్ షెడ్, వైకుంఠధామాలను సైతం పరిశీలించి నిత్యం వినియోగంలో ఉండేలా చూడాలన్నారు. అలాగే గ్రామంలో ఈజీఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న చెరువు అభివృద్ధి, ఫిష్‌పాండ్, వ్యవసాయ భూ అభివృద్ధి, ఇతర ఈజీఎస్ అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పని స్థలాల్లోని కూలీలకు వేసవిలో దాహార్తి బారిన పడకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లను స్వయంగా అందజేసి రానున్న రోజుల్లో వేసవి తీవ్రత అత్యధికంగా ఉండే అవకాశం ఉందని ఇందుకు తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంపీడీఓ వెంట ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి ఉదయ్, సాంకేతిక సహాయకురాలు స్రవంతి ఉన్నారు.

కుంగిన బోరు... అందని నీరు



భీమిని: కన్నెపల్లి మండలంలోని నాయకునిపేట గ్రామపంచాయతీ పరిధిలోని కుర్మగూడం (మొక్కంపల్లి) ప్రాథమిక పాఠశాల ఎదుట గల బోర్‌వెల్ కుంగిపోయింది. దీంతో విద్యార్థులు, కాలనీవాసులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు బోర్‌వెల్‌ను సరిచేసి విద్యార్థులకు, స్థానికులకు నీటిని అందించాలని కోరుతున్నారు.

డీలర్లకు అవగాహన

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని రైతు వేదికలో బుధవారం చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి, భీమారం, జైపూర్ మండలాల ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల డీలర్లకు ఇన్‌చార్జి ఏడీఏ రాజేశం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా వచ్చే సీజన్‌కి సంబంధించిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఎరువుల లభ్యతపై అవగాహన కల్పించారు. నకిలీ పత్తి విత్తనాలు ఎవరైనా ప్రైవేటు వ్యక్తులు అమ్మినా, సరఫరా చేసినా సమాచారం అందించాలన్నారు. నకిలీలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్, కోటపల్లి ఏవోలు మార్క్‌గ్లాడ్‌స్టన్, మహేందర్, ఏఈవో రాజశేఖర్ పాల్గొన్నారు.

‘నిధులు తీసుకొచ్చింది మాజీ ఎమ్మెల్యేనే’



మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకొచ్చిన ఘనత మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుదేనని, ప్రస్తుత ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నిధులను తీసుకొచ్చినట్లుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం మాట్లాడారు. నియోజకవర్గంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు, గూడెం ఎత్తిపోతల పథకం, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, హమాలీవాడ రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణం వంటివి చేయించారని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు చేపించారని గుర్తు చేశారు. మంచిర్యాల పట్టణంలోని బైపాస్ రోడ్డు, పట్టణంలోని నాలుగు జంక్షన్ల అభివృద్ధి పనులతో పాటు, రోడ్లు వేయించిన ఘనత మాజీ ఎమ్మెల్యేదేనని తెలిపారు. కానీ వీటిని కాంగ్రెస్ పార్టీ నాయకులు వారి ఖాతాలో వేసుకోవడం సరికాదన్నారు. అమృత్ 2.0 పథకం ద్వారా తాగు నీటికి నిధుల కేటాయింపు, రాళ్లవాగుపై రంగంపేట బ్రిడ్జి నిర్మాణానికి నిధులను తీసుకొచ్చారని తెలిపారు. అయితే రూ.202 కోట్లు తమ ఎమ్మెల్యే తీసుకొచ్చారని కాంగ్రెస్ పార్టీ వారు చెప్పుకుంటున్నారని, వీటిని ఎక్కడి నుంచి తీసుకువచ్చారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. డీఎంఎఫ్‌టీ ద్వారా 430 పనులను దివాకర్‌రావు ప్రారంభిస్తే, వాటిని ప్రస్తుత ఎమ్మెల్యే రద్దు చేసి తిరిగి కొత్తగా ప్రారంభించారని ఆరోపించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, నాయకులు గోగుల రవీందర్ రెడ్డి, తాజ్, శ్రీరాముల మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం నుంచి గాంధీచౌక్ వరకూ జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు, ఆర్మ్‌డ్, సివిల్ పోలీసులు కవాతు నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా జరిగేందుకు ప్రతీఒక్కరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్, కోటపల్లి, శ్రీరాంపూర్ సీఐలు రవీందర్, మోహన్, సుధాకర్, ఎస్సైలు, వెంకటేశ్వర్, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

పుస్తె, మట్టెలు అందజేత



పుస్తె, మట్టెలు ఇస్తున్న సురేఖ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని గౌతమి నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకురాలి వివాహానికి బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ హాజరై పుస్తె, మట్టెలను అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, జగన్, నాయకులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

బెల్లంపల్లిరూరల్: పశువులకు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని ఆకెనపల్లి పశువైద్యాధికారిణి సుజాత అన్నారు. బుధవారం మండలంలోని ఆకెనపల్లి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా యజమానులు తగిన జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. వేసవిలో పశువుల దాహార్తి, మేత కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఆకెనపల్లి పరిధిలో ఇప్పటి వరకు 550 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగిందని తెలిపారు. రైతులు పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సిబ్బంది వెంకటరమణ పాల్గొన్నారు.

కార్పొరేషన్ చైర్మన్‌కు ఆదివాసీల సన్మానం



తిరుపతిని సన్మానిస్తున్న నాయకులు

కాసిపేట: మండల ఆదివాసీ సేనా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ కో ఆపరేటివ్ ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపికైన కొట్నాక తిరుపతిని బుధవారం దండేపల్లి మండలం అల్లిపూర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ ఆశవాహ అభ్యర్థి తిరుపతిని ప్రభుత్వం ఆదివాసీల తరుపున గుర్తించి చైర్మన్‌గా నియమించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు మడావి వెంకటేష్, గౌరవాధ్యక్షుడు మడావి గంగారాం, వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం శంకర్, సిడం గణపతి, ఆత్రం సంజీవ్, పెంద్రం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన కాలువ డ్రాప్



శిథిలమైన కాలువ దృశ్యం

దండేపల్లి: మండలంలో పలు చోట్ల కడెం డిస్ట్రిబ్యూటరీ కాలువలు శిథిలావస్థకు చేరాయి. లైనింగ్‌లు దెబ్బతినడంతో పాటు, తూములు చెడిపోయాయి. డిస్ట్రిబ్యూటరీ 28 కాలువకు దండేపల్లి సమీపంలో డ్రాప్ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. డ్రాప్ కూలి మొత్తం కాలువలో పడిపోయింది. వచ్చే ఖరీఫ్‌లోగా డిస్ట్రిబ్యూటరీ కాలువలకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



ప్రచారం నిర్వహిస్తున్న గోమాస శ్రీనివాస్

మంచిర్యాలటౌన్: పెద్దపల్లి పార్లమెంట్‌లో బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే మరింత అభివృద్ధి సాధ్యం అవుతుందని ఆ పార్టీ ఎంపి అభ్యర్థి గోమాస శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీనివాస థియేటర్ ప్రధాన రోడ్డులో ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతి షాపుకు వెళ్లి బుధవారం ఎన్నికల ప్రచారాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లితో కలిసి నిర్వహించారు. పెద్దపల్లి ఎంపీగా తనను గెలిపిస్తే పార్లమెంట్ పరిధిలోని ప్రతి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. పెద్దపల్లి పురుషోత్తం, ముల్కల్ల మల్లారెడ్డి, రజనీశ్ జైన్, పురుషోత్తం జాజు, మున్నారాజు సిసోడియా, రంగ శ్రీశైలం, బోయిని హరికృష్ణ, గోలి రాము, పబ్బతినేని కమలాకర్‌రావు, మోటపలుకుల తిరుపతి, జోగుల శ్రీదేవి, సతీవ్, సత్రం రమేశ్, ఆకుల సంతోష్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని తహసీల్దార్ రాఘవేంద్రరావుపై జిల్లా కలెక్టర్ కార్యాలయం ఇన్‌వార్డు అధికారి సుధీర్‌కు ఫిర్యాదు చేసినట్లు సీపీఎం (ఎంఎల్) డెమోక్రసీ నాయకులు దొండ ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ సమయపాలన పాటించడం లేదని, మండల కేంద్రంలో ఉండకుండా ప్రతి రోజు మంచిర్యాల నుంచి వస్తున్నాడని పేర్కొన్నారు. రేషన్ దుకాణాదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, సమయపాలన పాటించకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని, ఊత్కూరు శివారులోని సర్వే నంబర్ 375లో భూమి ఆక్రమణకు గురవుతున్న పట్టించుకోవడం లేదని, తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

స్విమ్మింగ్ పూల్ ప్రారంభం



ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని హైటెక్‌సిటీ కాలనీ మంచిర్యాల క్లబ్‌లోని స్విమ్మింగ్ పూల్‌ను బుధవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య ప్రారంభించారు. ఈ స్విమ్మింగ్ పూల్‌లో క్లబ్ సభ్యులు, వారి కుటుంబ సభ్యులకు అవకాశం ఉండగా, బయటి వ్యక్తులు నెలవారి ఫీజు చెల్లించి ఉదయం 5:30 నుంచి 9:30 వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ ఓదెలు, క్లబ్ సెక్రటరీ జితేందర్ రావు, వైస్ ప్రసిడెంట్ పురుషోత్తం జాజు, జాయింట్ సెక్రటరీ నగేశ్, సత్యపాల్ రెడ్డి, మాదంశెట్టి సత్యనారాయణ, జలగం నారాయణరావు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి ఆలయం హుండీని బుధవారం లెక్కించారు. ఆలయంలో నెలన్నరకు సంబంధించిన తొమ్మిది హుండీలను వేలాల ఈవో రమేష్ పర్యవేక్షణలో లెక్కింపు చేయగా రూ. 1,02,544 ఆదాయం వచ్చినట్లు ఈవో ముక్తారవి తెలి పారు. లలితాసేవా సమితి సభ్యులు, విశ్వనాథస్వామి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీఎల్‌వీ దరఖాస్తుల గడువు పొడిగింపు

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో బ్యాక్‌లాగ్ వేకెన్సీ (బీఎల్‌వీ)లకు దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించినట్లు ఆదిలాబాద్ రీజియన్ ఆర్‌సీవో కొప్పుల స్వరూపారాణి ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ జిల్లా అల్గునూర్ (సీఓఈ), రంగారెడ్డి జిల్లా గౌలిదొడ్డి పాఠశాలలో 9వ తరగతిలో మాత్రమే రెగ్యులర్ అడ్మిషన్స్ కోరుతున్నట్లు తెలిపారు. గిరిజన సీఓఈ పరిగి (బాలికలు), వికారాబాద్, ఖమ్మం (8వ తరగతిలో మాత్రమే) బాలుర పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఏప్రిల్ 21న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుదని, ఆసక్తి కలిగిన విద్యార్థులు తుది గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బాటచారులకు చల్లదనం పంచుతూ..



చెన్నూర్‌రూరల్: వేసవికాలం ప్రారంభమైంది. ఇప్పుడే ఎండ వేడిమికి బయటకు వెళ్లలేని పరిస్థితి. రోజురోజుకూ ఎండలు మరింతగా ముదిరే అవకాశాలున్నాయి. కానీ మండలంలోని అక్కెపల్లి గ్రామం నుంచి చింతలపల్లి గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా చల్లదనాన్ని పంచుతూ ప్రయాణికులకు ఎండ నుంచి రక్షణ కల్పిస్తున్నాయి. వాహనదారులు కొంత సేపు ఆ చెట్ల నీడన సేద తీరుతున్నారు.

నేడు 5కే రన్

బెల్లంపల్లి: పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గురువారం అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రమైన బెల్లంపల్లిలో 5కే రన్ నిర్వహించడానికి ఎన్నికల అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఓటు హక్కును వినియోగించుకోవాలని అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేశారు.